# తెలుగు భాషలో తెగులు సీరియళ్ళు

తెలుగు ఛానళ్ళలో 'తెగులు 'సీరియళ్ళు
చూసేవారికి చూసినంత తగ్గినా..
సీరియళ్ళది మాత్రం సాగినంత ఆయుష్షు
తలకాయ మారినా గొంతు మారదు
పలికేదొకరు .... నోరు మెదిపేదొకరు
ఒత్తులతో పనిలేనప్పుడు
ఎవరు పలికినా .. భాషకు వేరే బాధేముంది
సిగ్గులేని సిగపట్లుంటే ..
కథ ఏదయినా కన్నులకు విందే
అరాచకాలన్నీ అరచేతిలోనే
ఏదయిన నేర్వచ్చు అరచిటికలోనే
ఆడవిలన్లు గన్ మెషీనులు
అన్ని హంగులతో రౌడీగాంగులు
నోట్ల కట్టల గుట్టలు, సెల్లు ఫోన్లు
చేతి సంచీలోనే - రౌడీ రాజ్యం
చెయ్యా..? కాలా..? అడగాలా?!
మొత్తానికే లేపేస్తే పోలా ?
పసిపాపలకు చెత్త కుప్పలు-తల్లితండ్రులకు
చేతి చిప్పలు - ఇస్తే నష్టమేముంది
హారతి వెలిగించి గంట మోగిస్తె సరి
చూసిన పాపం, చూపిన పాపం కర్పూర దీపమే!
పాత్రలు మారితే ఆత్మలు వచ్చేస్తాయి
కథలు సాగితే – తరాలు పుట్టేస్తాయి
చూసేవారి బి.పి. షుగర్ లెవెల్ మారితే..
వైద్యులకు ప్రతిరోజు ధనత్రయోదశే !
సీరియళ్ళ పుష్కరంలో తల్లులు మునిగితే..
తెగులు పుట్టేది కుర్రకుంకలకే !
తెగువ కలవారెవరేనా వుంటే..నడుం బిగించి
తెలుగు సీరియళ్ళ 'తెగులు' వదల్చండి !!